జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
సోమవారం | 16 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 7

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో
వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ, నవంబర్, 15: ప్రజా జ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామిదేవాలయంలో కార్తీకమాసఉత్సవాలుఅత్యంతవైభవంగాకొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, ఐదవ రోజు వేడుకలను

మిగతా 2 లో...

- జిల్లాలో 13,913 మందికి కొత్త పింఛన్లు మంజూరు.
- మిగిలిన అర్హుల దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

జగిత్యాల, నవంబర్ 15 , ప్రజా జ్యోతి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన నూతన చేయూత సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు.రాష్ట్రఆర్థికపరిస్థితుల్లోఒడిదుడుకులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, అదనంగా మరో 2,000 ఇళ్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.జగిత్యాలజిల్లాలో కొత్త పింఛన్ల కోసం 18,955 దరఖాస్తులు రాగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి 13,913 మందిని అర్హులుగా

మిగతా 2 లో...

రెడ్ క్రాస్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా దాన కిషోర్ ఏకగ్రీవ ఎన్నిక



- లోక్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఎన్నిక
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను సత్కరించిన పెద్దపల్లి జిల్లా చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వరరావు

హైదరాబాద్, నవంబర్ 15, ప్రజా జ్యోతి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం లోక్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ (SMC) సమావేశంలో కమిటీ సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, దాన కిషోర్‌ను రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా నామినేట్ చేయగా, కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్, ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్, నషా ముక్త్ భారత్, విపత్తుల నిర్వహణ కమిటీలకు కూడా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు, జిల్లా చైర్మన్లు, చైర్‌పర్సన్లను గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పాలక మండలి సభ్యుడు కావేటి రాజ గోపాల్ పాల్గొని గవర్నర్‌ను శాలువాతో సత్కరించారు.

నిజరూప దర్శనానికి శ్రీకారం

- చందనోత్సవ అంకురార్పణతో ప్రారంభం
- తన పూర్వజన్మ సుకృతమని వాక్యానించిన మేడిపల్లి సత్యం



మల్యాల,నవంబర్ 15, ప్రజాజ్యోతి: కొండగట్టు ఆంజనేయ స్వామి నిజరూపదర్శనానికిశ్రీకారంచుట్టి,స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతులు మీదుగా చందనోత్సవ అంకురార్పణ ప్రారంభమైనట్లు ఆలయ ఈవో అంజన రెడ్డి తెలిపారు. స్వామివారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ మహత్కార్యం చందనోత్సవం, స్వామి నిజరూపదర్శనకార్యక్రమానికితన చేతుల మీదుగా అంకురార్పణ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా, గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, భక్తులు, ప్రతి ఒక్కరు స్వామి వారి కార్యక్రమంలో భాగస్వాములై స్వామి వారి

మిగతా 2 లో...

వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గొల్లపల్లి నవంబర్ 15 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో మాజీ ఉపసర్పంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జుర్రు వెంకయ్య కూతురు వివాహ వేడుకల్లో పాల్గొని మరియు బొంకూర్ గ్రామంలో రిసెప్షన్ లో తెలంగాణరాష్ట్రసంక్షేమశాఖమంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డితో కలిసి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.నూతనదంపతులు జీవితాంతం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కలిసిమెలిసి జీవించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట బొంకూర్ సర్పంచ్ ముల్క శిరీష శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు రెవెల్లి సత్యనారాయణ గౌడ్ చిర్ర గంగాధర్ కొండా వెంకటేష్ పురం శెట్టి గౌతమ్ వెంకటేష్ శ్రీధర్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి...)

గుర్తించి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉండి పింఛన్లు పొందని వారు ఆందోళన చెందవద్దని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా వారి దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు ఈ పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. కొత్తగా పింఛన్లు పొందుతున్న 13,913 మంది లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే వివిధ కేటగిరీలకు చెందిన సుమారు 2.13 లక్షల మందికి ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని తెలిపారు.

నూతన పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను మండల, జిల్లా స్థాయి అధికారుల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించినట్లు వివరించారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో ఒంటరి మహిళలు 1,714 మంది, వితంతువులు 6,434 మంది, దివ్యాంగులు 2,710 మంది, కల్లుగీత కార్మికులు 1,873 మంది, చేనేత కార్మికులు 100 మంది, ఫైలేరియా బాధితులు 1,082 మంది ఉన్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులకు రూ.4,016 చొప్పున పింఛన్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఈ పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉండి దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిశీలనలో మిగిలిపోయిన వారు ప్రత్యేక కౌంటర్లలో వివరాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. వచ్చిన దరఖాస్తులను మరోసారి పరిశీలించి వారం నుంచి రెండు వారాల్లోగా అర్హతలను నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, డీఆర్‌డీఏ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం



(మొదటి పేజీ తరువాయి...)

ఆలయ ఈవో ఎల్.రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఏఈఓ జయకుమారి, పర్యవేక్షకులు ఓన్నారం భాస్కర్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిజరూప దర్శనానికి శ్రీకారం





(మొదటి పేజీ తరువాయి...)

కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి తప్పకుండా హాజరవుతానని మాట ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి అంజనారెడ్డి మాట్లాడుతూ నవంబర్ 15వ తేదీ నుండి నవంబర్ 20 తేది వరకు స్వామివారి మూల విరాట్‌కు అలంకరించిన చందనాన్ని తొలగించే కార్యక్రమాన్ని శాస్త్రంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ ఐదు రోజులపాటు సాధారణ దర్శనాలు నిలిపివేయబడతాయని, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బాలాలయంలో ఉన్న స్వామివారిని దర్శించుకొని భక్తులు మొక్కలు చెల్లించుకోవాలని సూచించారు. నవంబర్ 20 తేదీ నుండి డిసెంబర్ 29 వ తేదీ వరకు భక్తులు స్వామివారి అరుదైన నిజరూప దర్శన భాగ్యం కల్పించబడుతుందని, భక్తులందరూ ఈ మహత్కర అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్ర ప్రసాద్, చిరంజీవి స్వామి, స్థానాచార్యులు కపిందర్, సహాయ కార్యనిర్వహణ అధికారి హరిహర నాథ్, ఆలయ పర్యవేక్షకులు సునీల్, ఆలయ పరిశీలకులు అశోక్, లక్ష్మారెడ్డి, ప్రజా ప్రతినిధులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు 19న ఇంటర్వ్యూలు



కొడిమ్యాల, నవంబర్ 15, (ప్రజాజ్యోతి): మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టులకు సంబంధించి ఈనెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు జగిత్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ వీరాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ఐక్యంగా కృషి చేయాలి.

కుల వివక్ష నిర్మూలన, సమాన విద్యే లక్ష్యం – నక్క జమలాకర్



జగిత్యాల, నవంబర్ 15, ప్రజాజ్యోతి. . డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని గొల్లపల్లి మండల ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు నక్క జమలాకర్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రతి ఆదివారం డిక్కీ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష, అసమానతలను రూపుమాపి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, సామాజిక సమానత్వం అందేలా కృషి చేయాలని అన్నారు. అంబేద్కర్ చరిత్ర, రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయ సందేశాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నల్ల శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, కంటే అంజయ్య, ముద్దమల్ల ప్రవీణ్ కుమార్ తదితర అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

ధర్మారం గ్రామానికి 18 నూతన పింఛన్లు మంజూరు

- నలుగురు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాల అందజేత

కోరుట్ల రూరల్, నవంబర్ 15 (ప్రజా జ్యోతి) కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామానికి మొత్తం 18 నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ఈరోజు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గౌరవ మంత్రివర్యుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డి, ఎంపీడీవో, ఉపసర్పంచ్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. నూతన పింఛన్లు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గృహప్రవేశ వేడుకలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

- ఏలేటి విజయేందర్‌రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు



ఎండపల్లి, నవంబర్ 15, ప్రజా జ్యోతి మండలంలోని రాజరాంపల్లి గ్రామానికి చెందిన ఏలేటి విజయేందర్‌రెడ్డి (లడ్డు పటేల్) నూతన గృహప్రవేశ మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెడుతున్న విజయేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయేందర్‌రెడ్డి కుటుంబానికి అభినందనలు తెలిపారు. వీరి వెంట ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మేరుగు జానీ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

నిరుపేద కుటుంబానికి దాతల ఆర్థిక చేయూత

- చిన్నాపూర్‌లో పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.15 వేల సాయం



బుగ్గారం నవంబర్ 15(ప్రజాజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి పలువురు దాతలు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన గజ్జల విజయలక్ష్మి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో, ఆమె కుమార్తె వివాహ ఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన దాతలు ముందుకొచ్చి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామ సర్పంచ్ గట్టు శారద గంగారం రూ.5 వేలు, పైడిపల్లి వామన్ రావు రూ.5 వేలు, కడుదురి గంగారెడ్డి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేల సాయం అందించారు. ఆపద సమయంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, ఆడబిడ్డ వివాహానికి సహకరించిన దాతలకు విజయలక్ష్మి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం,పరస్పర సహకార భావనను పెంపొందిస్తాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పరుమల రాజశేఖర్ పాల్గొన్నారు.

మొసలి సంచారంతో గ్రామస్థుల్లో ఆందోళన

- చెరువు పరిసరాల్లోకి వెళ్లొద్దంటూ గ్రామస్థులకు హెచ్చరిక
- అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



మల్లాపూర్, నవంబరు 15, ప్రజాజ్యోతి మండలంలోని మొగిలిపేట పెద్ద చెరువులో మొసలి సంచరిస్తున్నట్లు వస్తున్న సమాచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చెరువులోని భీమన్న గుడి పరిసర ప్రాంతాల్లో మొసలి కనిపించినట్లు సమాచారం ఉండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు పశువులు, గొర్రెల కాపరులు, రైతులు, చిన్నారులు చెరువు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్థులకు స్థానిక నాయకులు సూచించారు. ఆదివారం వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. మొసలి సంచారానికి సంబంధించిన సమాచారాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక నాయకులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మొసలి ఆచూకీ గుర్తించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మొసలి సంచారం నిజమైతే దానిని సురక్షితంగా పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని, ప్రజలు, పశువులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కొడిమ్యాల,నవంబర్ 15,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందనలభించింది.జగిత్యాలకు చెందిననేత్ర చర్మవ్యాధుల హాస్పిటల్ వారిచే సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలకు చర్మవ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జీవన్ రెడ్డి తెలిపారు.

జీవో 97 సవరణతో పాలిటెక్నిక్ విద్యార్థుల్లో హర్షం

- విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి అభినందించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు
- విద్యార్థుల పక్షాన నిలిచి పోరాడిన ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కు కృతజ్ఞతలు



కోరుట్ల,నవంబర్ 15ప్రజాజ్యోతి నైపుణ్య విద్య బలపడాలి,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు అభివృద్ధి చెందాలి, పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందాలన్నదే తమ నినాదమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.జీవో నంబర్ 97ను సవరించిన సందర్భంగా కోరుట్లలో పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసి బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జీవో నంబర్ 97 విషయంలో తమకు అండగా నిలిచి, జీవో సవరణ కోసం పోరాటం చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కోరుట్ల బీఆర్ఎస్ బృందం ద్వారా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ పొట్ట సురేందర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన సాంకేతిక విద్య ఎంతో అవసరమని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు బలోపేతం కావాలని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ జాల వినోద్, నాయకులు నీలి శ్రీనివాస్, అతీక్, గంగాధర్, మహేష్, శేఖర్, అమేర్, అజమాత్, తైసీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

- ఈ నెల 20న ధ్రువపత్రాల పరిశీలన..

ఎండపల్లి, నవంబరు 15 , ప్రజా జ్యోతి జగిత్యాల జిల్లాలో ధర్మపురి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 20వ తేదీ (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో అర్హులైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ ధర్మపురి ప్రాజెక్టు అధికారిని వాణిశ్రీ, ఎండపల్లి సూపర్వైజర్ ఆండాళ్ ఒక ప్రకటనలో కోరారు.అభ్యర్థులు తమ విద్యార్హత, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. నిర్ణీత సమయానికి హాజరుకావాలని, ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఖాళీల వివరాలు భీర్పూర్–1, భీరపూర్–II, బుదగజంగాల కాలనీ, చెరుకుపల్లి, జైన–11, కోమన్నాల్లి, కోనాపూర్–11, మద్దునూర్–2, నేరెళ్ల–1, పడ్కల్, పోతారం–1, రామయ్యపల్లి–1, రంగపేట్–2, తుంగూర్–1, తుంగూర్–II, వెంకటాపూర్ ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తు చేసి ఉన్న అర్హులైన వారు సకాలంలో ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు.

రాజారాంపల్లి యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు సంఘు రాములు..
- ముఖ్య అతిథిగా సర్పంచ్ సంఘు రమేష్ యాదవ్



ఎండపల్లి, నవంబర్ 15, ప్రజా జ్యోతి మండలంలోని రాజారాంపల్లి గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ హాజరయ్యారు.గౌరవ అధ్యక్షులు: దాసరి మల్లయ్య, ఒర్రే గట్టయ్య, కంబల ఐలయ్య,అధ్యక్షుడు: సంఘు రాములు.ఉపాధ్యక్షులు: జల్లెల రాములు, మాచర్ల శ్రీనివాస్. కార్యవర్గ సభ్యులు: గోపనవేని సత్తయ్య, తమ్మనవేణి ఓదెలు, తొట్ల మల్లయ్య, ఏదుల గోపాల్, మాచర్ల రమేష్, అమ్ముల నరేష్, మేకల సంజీవ్ (ఓదెలు కుమారుడు), ఈరు కుమార్, సింగారపు గంగరాజు, పొన్నాల ఐలయ్య, ఒర్రే సంజీవ్, మేకల సంజీవ్ (గంగయ్య కుమారుడు) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన అజర్ భాయ్



- రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందన..
- 108కు ఫోన్ చేసి యువకుడిని ఆసుపత్రికి తరలించేలా సహకారం
- మానవత్వం చాటుకున్న తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు

కోరుట్ల, నవంబర్ 15 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణంలోని కిసాన్ షాపింగ్ మాల్ ఎదుట ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనను గమనించిన తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజర్ భాయ్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.ప్రమాదంలో గాయపడిన యువకుడికి సకాలంలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, యువకుడిని ఆసుపత్రికి తరలించేలా సహకరించారు.ఆపద సమయంలో క్షణం ఆలస్యం చేయకుండా స్పందించి బాధితుడికి సహాయం అందించిన అజర్ భాయ్‌ను పలువురు అభినందిస్తున్నారు.పదవులు, హోదాల కంటే ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే గొప్ప మానవత్వమని అజర్ భాయ్ తన సేవా దృక్పథంతో చాటిచెప్పారు.



ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

► లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మెన కు



గొల్లపల్లి నవంబర్ 15 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలంలోని చిల్వాకోదూరు గ్రామంలో మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని సుమారు 122 మందికి ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొమ్మెన కుమార్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పుల వల్ల షుగర్, బీపీ వంటి వ్యాధులు సాధారణమైపోయాయని, ప్రతి ఒక్కరూ ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భవిష్యత్తులోనూ పేద ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆర్ఎంపీ వైద్యులు చొప్పదండి చంద్రయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో గో ఆధారిత సమీకృత వ్యవసాయ క్షేత్రం ఆవిష్కరణ

► గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం, ఉత్పత్తుల తయారీకి ప్రత్యేక ప్రాధాన్యం





మేడిపల్లి, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాల అనుబంధ వ్యవసాయ క్షేత్రంలో గో ఆధారిత సమీకృత వ్యవసాయ క్షేత్రం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గో ఆధారిత ఉత్పత్తుల తయారీతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సమీకృత వ్యవసాయ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా హోమం, గోపూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన గోశాల షెడ్డు, గో ఆధారిత ఉత్పత్తుల నిల్వ కోసం ఏర్పాటు చేసిన గోదాం, పట్టు పరిశ్రమ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లు, వివిధ రకాల మొక్కలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలను దాతల చేతుల మీదుగా ప్రారంభించారు. అదేవిధంగా వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సురభి గోశాల కమిటీ తరపున దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురభి గోశాల అధ్యక్షులు తురగా రాజిరెడ్డి, దాతలు, గోశాల కమిటీ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు, గోభక్తులు, వివిధ ధార్మిక క్షేత్రాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో ఐదో రోజు పాదయాత్ర

■ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు



ముస్తాబాద్, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలనే ఆకాంక్షతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఐదో రోజు పాదయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తూ చేపట్టిన ఈ పాదయాత్రలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐదో రోజు పాదయాత్రలో భాగంగా నాయకులంతా యాదాద్రి క్షేత్రానికి చేరుకుని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలనే తమ ఆకాంక్షను ఈ సందర్భంగా నాయకులు వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమవుతూ, ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శిస్తూ సాగుతున్న ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్ గౌడ్, నాయకులు తాడేపు ఎల్లం, కంచం నర్సింలు, కొమ్మెట రాజు, సామాజిక మాధ్యమాల విభాగం ప్రతినిధులు పరిదిపేట వెంకటేష్, జాహింగిర్, గన్నే స్వామి, మామిడ్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ పాదయాత్రలో పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ఆకాంక్షను తెలియజేస్తున్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనంతో ఐదో రోజు పాదయాత్ర ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 1,00,116 విరాళం



వేములవాడ,నవంబర్,15:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి మరియు విస్తరణ పనుల నిమిత్తం దేవరాజ్, శ్రీమతి ఉమా బాలచందర్ దంపతులు లక్షా నూట పదహారు రూపాయల (1,00,116) విరాళాన్ని అందజేశారు. యూఎస్ఏ లో ఉంటున్న తమ మనుమడు అవ్వాన్ అన్నప్రాసన వేడుక సందర్భంగా వారు ఈ విరాళాన్ని అందజేయాలని సంకల్పించారు. ఈ మేరకు ఆలయ ఈ.వో రమాదేవికి వారు చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ ఈవో రమాదేవి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆ దంపతులకు శేషవస్త్రం అందజేసి, స్వామివారి లడ్డు ప్రసాదాన్ని బహూకరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఉదయ్ నందన్ రెడ్డి భారీ విరాళం









- రెడ్డిపల్లి గ్రామ ఆధ్యాత్మిక వేడుకకు రూ..16 లక్షల ఆర్థిక సాయం..
- గ్రామ సంప్రదాయాల పరిరక్షణకు అండగా నిలిచిన యూప్ టీవీ, టూరిటో వ్యవస్థాపకుడు

వీణవంక,నవంబర్ 15 (ప్రజాజ్యోతి) గ్రామ సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక కార్యక్రమాల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తూ యూప్ టీవీ & టూరిటో సంస్థల వ్యవస్థాపకులు, ఫౌండర్ అండ్ సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని రెడ్డిపల్లి గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏకంగా రూ.1,16,000 ఆర్థిక విరాళాన్ని అందజేశారు. గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూ ఉదయ్ నందన్ రెడ్డి అందించిన ఈ భారీ విరాళంపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార రంగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగినప్పటికీ, పుట్టిన గడ్డతో అనుబంధాన్ని కొనసాగిస్తూ గ్రామ అభివృద్ధి, సంప్రదాయ కార్యక్రమాల్లో భాగస్వామి కావడం అభినందనీయమని కొనియాడారు. స్వగ్రామ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆయనకు ఉన్న మమకారం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక కార్యక్రమాల విజయవంతానికి తన వంతు ప్రోత్సాహం అందించడం ప్రశంసనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఉదయ్ నందన్ రెడ్డి అభిమానులు , బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున పాడి ఉదయ్ నందన్ రెడ్డికి కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పరారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడు అరెస్ట్



కరీంనగర్ క్రైం, నవంబర్ 15, (ప్రజాజ్యోతి): గంజాయి విక్రయాల కేసులో పరారీలో ఉన్న పకీర్ పేటకు చెందిన అడప వంశీని కరీంనగర్ రూరల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.అతడు పారిపోయేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.గత నెలలో నగునూరు శివారులో గంజాయి విక్రయాలకు సిద్ధమవుతున్న ఇద్దరిని పోలీసులు గుర్తించగా..శ్రీరామ్ పట్టుబడి,వంశీ పరారయ్యాడు.అప్పట్లో శ్రీరామ్ వద్ద నుంచి 1.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అప్పటి నుంచి గాలింపు చేపట్టిన పోలీసులు ఆదివారం పకీర్ పేటలో వంశీని అదుపులోకి తీసుకున్నారు.వంశీపై కరీంనగర్ రూరల్,చొప్పదండి,సుల్తానాబాద్ తదితర పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని, ఇప్పటికే రౌడీషీట్ తెరిచినట్లు పోలీసులు తెలిపారు.గంజాయి అక్రమ రవాణా,విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

సేవే లక్ష్యంగా.. సమాజమే స్ఫూర్తిగా!

- 11 ఏళ్ల నిరంతర సామాజిక సేవకు అరుదైన గౌరవం.. మేడి సురేష్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్ ప్రదానం



ముస్తాబాద్, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పం కొందరిలోనే ఉంటుంది. ఆ సంకల్పాన్ని మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపిస్తూ,ఎలాంటిప్రతిఫలంఆశించకుండా పదకొండేళ్లుగా సేవా మార్గంలో ముందుకు సాగుతున్నవ్యక్తి మేడి సురేష్. సమాజమే తన కుటుంబంగా భావిస్తూ,ప్రజా సంక్షేమమే తన లక్ష్యంగా చేసుకుని నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఆయనకు అరుదైన గౌరవం దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేడి సురేష్ సామాజిక సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆయన అందించిన సేవలను గుర్తించిన ఢిల్లీకి చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

పదకొండేళ్ల సేవా ప్రయాణానికి గుర్తింపు

సామాజిక సేవ అనేది ఒకరోజు చేసే కార్యక్రమం కాదు..నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యత. ఈ విషయాన్ని నమ్మిన మేడి సురేష్ గత పదకొండేళ్లుగా సామాజిక సేవకు అంకితమయ్యారు. నిరుపేదలు, ఆపదలో ఉన్నవారు, అవసరంలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ హితం ముఖ్యమనే ఆలోచనతో ఆయన సాగిస్తున్న సేవా ప్రయాణం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

ఢిల్లీ వేదికగా శనివారం గౌరవ డాక్టరేట్ ప్రదానం

మేడి సురేష్ గత పదకొండేళ్లుగా సామాజిక సేవా రంగంలో అందిస్తున్నవిశేష సేవలు,ప్రజలపట్ల చూపుతున్న బాధ్యత, సమాజ అభ్యున్నతి కోసం చేస్తున్న కృషిని గుర్తించిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండేషన్ ఆయనను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ క్రమంలో శనివారం ఢిల్లీలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ చంద్ర పాల్ చేతులమీదుగా మేడి సురేష్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున సామాజిక సేవా విభాగంలో ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కడం విశేషం. పదకొండేళ్లుగా ఆయన సాగిస్తున్న నిస్వార్థ సేవా ప్రయాణానికి ఈ పురస్కారం జాతీయ స్థాయిలో లభించిన ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

ఒక వ్యక్తికి దక్కిన గౌరవం.. ఒక గ్రామానికి గర్వకారణం

సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి, తన సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందడం మేడి సురేష్ సాధించిన ప్రత్యేకత. ఆయనకు లభించిన ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయంగా మాత్రమే కాకుండా, గూడెం గ్రామంతో పాటు ముస్తాబాద్ మండలానికి గర్వకారణంగా నిలుస్తోంది. పదకొండేళ్లుగా కొనసాగించిన సేవా ప్రయాణానికి గౌరవ డాక్టరేట్ రూపంలో గుర్తింపు రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో గుర్తింపు కోసం కాకుండా, సమాజానికి ఉపయోగపడాలనే తపనతో సేవ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. నిరంతర కృషి, నిస్వార్థ సేవకు తగిన గుర్తింపు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. మేడి సురేష్‌కు లభించిన ఈ గౌరవం యువతలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు మరింత మంది సామాజిక సేవ వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు.

మరింత సేవ చేయాలనే బాధ్యత పెరిగింది

తన పదకొండేళ్ల సామాజిక సేవ ప్రయాణానికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ లభించడం ఎంతో ఆనందంగా ఉందని మేడి సురేష్ తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఇప్పటివరకు అందించిన సేవలకు మించి భవిష్యత్తులోనూ సమాజ సంక్షేమం కోసం మరింత అంకితభావంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు. ఒక పురస్కారం అందుకోవడం విజయమైతే.. ఆ పురస్కారానికి కారణమైన సేవా స్ఫూర్తిని జీవితాంతం కొనసాగించడం అసలైన విజయం. ఆ దిశగా సాగుతున్న మేడి సురేష్ సేవా ప్రయాణం మరెందరికో ఆదర్శంగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 25,001 విరాళం



వేములవాడ,నవంబర్,15:ప్రజాజ్యోతి. రాజన్నసిరిసిల్లజిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ అభివృద్ధి,విస్తరణ పనులకోసం మల్లారం గ్రామానికి చెందిన వెంకటేష్ రూ. 25,001 (ఇరవై ఐదు వేల ఒక్క రూపాయి) విరాళంగా అందజేశారు. తనకు కొత్తగా ఉద్యోగం రావడంతో, స్వామివారి కృపకు కృతజ్ఞతగా ఈ విరాళాన్ని సమర్పించారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయ పి.ఆర్.ఓ., పెరిక శ్రీనివాస్ కి విరాళం మొత్తాన్ని అందజేశారు. అనంతరం దాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాతో సత్కరించారు.

గిరిజన హక్కుల పోరాట యోధుడు బిర్సా ముండా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- కొనరావుపేటలో 151 వ జయంతి వేడుకలు
- డీవీఎంసీ సభ్యుడు, సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్



కోనరావుపేట,నవంబర్. 15(ప్రజాజ్యోతి) కోనరావుపేట మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవంగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆదివాసీల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బిర్సా ముండాకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవీఎంసీ సభ్యుడు, సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగవాన్ బిర్సా ముండా కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, గిరిజనుల ఆత్మగౌరవానికి, హక్కుల సాధనకు, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. బ్రిటిష్ పాలకుల అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు బిర్సా ముండా జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, ముఖ్యంగా గిరిజన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసిస్తూ అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూనే సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు గీత భవానీ, రవి, తిరుపతి, రాజు, మదన్ లాల్, శ్యామల, ఊర్మిళ, మంజుల, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

- 130 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు..
- యంగ్ మైండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..



జమ్మికుంట, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో యంగ్ మైండ్స్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 130 మందికి పైగా ప్రజలు హాజరై వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్,ఎస్ఐ సంజీవ్ తో పాటు పోలీసు సిబ్బంది హాజరై యువత చేపట్టిన సేవా కార్యక్రమాన్ని అభినందించి ప్రోత్సాహం అందించారు. వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి, గ్రామ పెద్దలకు, గ్రామ ప్రజలకు అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యంగ్ మైండ్స్ యూత్ అసోసియేషన్ ప్రారంభించిన తొలి కార్యక్రమమే ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడటం ఆనందంగా ఉందని సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లూరి సునీల్, సలహాదారు దొగ్గల రాజు,కోశాధికారి పుల్లూరి పవన్ సూర్యలాల్,కార్యనిర్వాహక సభ్యులు దొగ్గల ఆనంద్, పుల్లూరి పునీత్, బోయిని అరుణ్, దొగ్గల రోహిత్ పాల్గొన్నారు.

కుంచెతో మెరిసిన చిన్నారులు

- పారమిత వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు





కరీంనగర్ టౌన్, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిలో కళాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు పారమిత వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లోని ఉపగ్ర హోమ్స్ వేదికగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చిత్రలేఖన ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేత చిన్నారులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొలం మల్లేష్, ఉపగ్న హోమ్స్ అధ్యక్షుడు సీహెచ్. రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, వి.యు.ఎం. ప్రసాద్, ప్రధానాచార్యులు శ్రీకర్, విద్యా సమన్వయకర్త దీప్తిరాణి, ఉపాధ్యాయులు, కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్లో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



కొప్పదండి, నవంబర్ 15 (ప్రజా జ్యోతి): కొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో ఆదివారం ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాలలో ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల పుస్తకాలను పరిశీలిస్తూ ఆసక్తిగా చదివారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవేందర్.డైరెక్టర్ రాజాదత్త,మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయుడు రఘుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

► ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో, డిఈఓ



వేములవాడ,నవంబర్,15 ప్రజాజ్యోతి: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఆలయ కార్యనిర్వహణాధికారి రమాదేవి,ఉపకార్యనిర్వహణాధికారి ప్రతాప్ నవీన్ కుమార్ ఆలయప్రాంగణంలోవిస్తృతంగా పర్యటిస్తూ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఆలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన వారు క్యూ లైన్ల నిర్వహణ, పారిశుభ్రత పనులు, త్రాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాలపై అధికారులకు తగు సూచనలు చేశారు.అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు వేములవాడ పట్టణ ప్రజలతో వారు నేరుగా మాట్లాడి, దర్శన ఏర్పాట్లపై అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు శీఘ్రంగా,ప్రశాంతంగా స్వామివారి దర్శనం కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు ఆదేశించారు.

అనుమతులు లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు

► కొనరావుపేట తహశీల్దార్ వరలక్ష్మి



కోనరావుపేట,నవంబర్. 15(ప్రజాజ్యోతి) కొనరావుపేట మండల పరిధిలో ముందస్తు ప్రభుత్వ అనుమతులు లేకుండా బోర్‌వెల్లు, బోర్‌హోల్స్ తవ్వకాలు చేపట్టవద్దని కోనరావుపేట తహశీల్దార్ వరలక్ష్మి మండల రైతులు, ప్రజలకు సూచించారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తే వాల్టా చట్టం–2002 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గత నెల 27 న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు.భవిష్యత్తులో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో భూగర్భ జలవనరులను సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.మండలంలోని రైతులు, ప్రజలు ఎవరైనా కొత్తగా బోర్‌వెల్ లేదా బోర్‌హోల్ తవ్వించాలనుకుంటే ముందుగా సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు లేకుండా బోర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్పష్టం చేశారు.

ఖిలావనపర్తి విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్ర


♦ బాలల దినోత్సవం వేళ ఆనందోత్సాహాలు





ధర్మారం, నవంబర్15(ప్రజా జ్యోతి): ధర్మారం మండలం ఖిలావనపర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విజ్ఞాన విహార యాత్ర ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది. శనివారం వేకువజామున పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం విహార యాత్రకు బయలుదేరి బాసర జ్ఞాన సరస్వతి ఆలయం, గోదావరి నదిని సందర్శించారు.అనంతరం నిర్మల్ జిల్లాలోని వండర్ ల్యాండ్ వాటర్ పార్క్‌కు చేరుకుని వివిధ వాటర్ రైడ్స్, ఆటలు, అడ్వెంచర్ గేమ్స్‌లో పాల్గొని విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. ఈ యాత్ర విద్యార్థులకు బాల్యంలో మరచిపోలేని మధుర జ్ఞాపకాలను అందించింది.అలాగే నిర్మల్ ప్రత్యేకతగా పేరొందిన కొయ్య బొమ్మల తయారీ విధానాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా చూపించి వివరించారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా యాత్రను రూపొందించడం విశేషం.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలుకుంట్ల స్వప్న మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పాఠశాల విద్యార్థులను ప్రత్యేక ప్రదేశాలకు విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు.ఇలాంటి పర్యటనలు విద్యార్థుల్లో కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తిని పెంచడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ వాటర్ పార్క్‌ను సందర్శించడం అభినందనీయమని, తమ వండర్ ల్యాండ్‌కు వచ్చిన తొలి ప్రభుత్వ పాఠశాల ఖిలావనపర్తి ప్రాథమికోన్నత పాఠశాలేనని నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు స్వప్నను ఘనంగా సన్మానించారు. విజయవంతంగా విహారయాత్రను పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సాగంటి శారద,గ్రామ సర్పంచ్ మోతె కనకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జయ, అర్చన, సంతోష్ కుమార్, సిద్ధిరాములు పాల్గొన్నారు.విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించిన వంట సిబ్బంది స్వప్న, రమ, స్కావెంజర్ పోచయ్యతో పాటు యాత్రకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయురాలు స్వప్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

పెళ్లి పందిరిలో పింగిలి రమేష్ సందడి.. వధూవరులకు ఆశీస్సులు



వీణవంక, నవంబర్ 15(ప్రజాజ్యోతి) వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దొండపాటి సంపత్ రెడ్డి కుమార్తె సుష్మ, రాజశేఖర్ రెడ్డిల వివాహ వేడుకకు కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.నూతన దంపతులు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో కలకాలం కలిసి జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఆయన రాకతో వివాహ వేడుకలో సందడి నెలకొంది.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి అడ్లూరి

• ఘనంగా సంగ రంజిత్ యాదవ్,కోమలత వివాహ వేడుకలు



ధర్మారం, నవంబర్ 15, ప్రజా జ్యోతి ధర్మారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,బోట్లవనపర్తి సర్పంచ్ సంగ రంజిత్ యాదవ్,కోమలత దంపతుల వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్‌సింగ్, పొనుగోటి శ్రీనివాసరావు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దంపతులను ఆశీర్వదించిన వారు.. వారి వైవాహిక జీవితం ప్రేమానురాగాలు, పరస్పర అవగాహన, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలు గ్రామాల సర్పంచులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

చరిత్రను చెరిపేశారు.. అభివృద్ధిని పక్కన పెట్టారు!

• ఎమ్మెల్యే అభివృద్ధి పనుల కంటే శిలాఫలకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు: నల్ల మనోహర్ రెడ్డి



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 15, ప్రజా జ్యోతి: పెద్దపల్లి పట్టణ చారిత్రక గుర్తింపును చెరిపేసేలా సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన కమాన్‌ను రాత్రికి రాత్రే తొలగించడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకుండా చారిత్రక కట్టడాన్ని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. కమాన్ తొలగింపును నిరసిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కమాన్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు.పెద్దపల్లి స్వాగత తోరణంగా గుర్తింపు పొందిన కమాన్‌ను తొలగించిన స్థలంలో కాకతీయుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అద్భుతమైన నూతన కమాన్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ చారిత్రక వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణ గాలికి.. ప్రజలకు ఇబ్బందులు... పెద్దపల్లి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని నల్ల మనోహర్ రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పారిశుద్ధ్య లోపాలతో అనారోగ్యకర పరిస్థితులు నెలకొంటున్నాయని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పట్టణంలోని పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శిలాఫలకాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏదీ?... పెద్దపల్లి అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఏర్పాటు చేయడంపై చూపుతున్న ఆసక్తిని బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపైనా చూపించాలని హితవు పలికారు. ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు.

పోలీసులు పాలకుల కోసమా.. ప్రజల కోసమా?... పోలీస్ అధికారులు పాలకుల కోసం పనిచేస్తున్నారా? ప్రజల కోసం పనిచేస్తున్నారా? అని నల్ల మనోహర్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అధికారులు తమ విధులను, బాధ్యతలను మరిచిపోకూడదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రథమ ప్రాధాన్యత కావాలని స్పష్టం చేశారు.పెద్దపల్లి చారిత్రక వారసత్వ పరిరక్షణతో పాటు పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు కావేటి రాజగోపాల్, రాజం మహంతకృష్ణ,పిట్ట వినయ్, గద్దల రాజు, అమరబండ సతీష్, కొలిపాక శేఖర్, అమరగొండ ప్రదీప్, బిరుదు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణవ్ బాబు అంటే మాట కాదు.. చేతల్లో సాయం





► బొడ్రాయి ప్రతిష్ఠాపనకు రూ.2,00,116 విరాళం

వీణవంక, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు గ్రామ ప్రజల ఐక్యతకు బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రతీకలుగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. వీణవంక మండలంలో రెడ్డిపల్లి గ్రామం లో నిర్వహించనున్న భూలక్ష్మి,మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి తన వంతు సహకారంగా రూ.2,00,116 భారీ విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని గ్రామ సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ.. బొడ్రాయి అనేది తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక చిహ్నమని, గ్రామానికి నాభిశిలగా, గ్రామదేవతలకు ప్రతినిధిగా ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. గ్రామ నడిబొడ్డున బొడ్రాయిని ప్రతిష్ఠించడం వెనుక గ్రామ ప్రజలంతా ఒక్కటిగా ఉండాలనే గొప్ప సందేశం దాగి ఉందన్నారు.బొడ్రాయి ప్రతిష్ఠాపన కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదని, గ్రామ ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం,పరస్పర సహకారాన్ని పెంపొందించే గొప్ప సంప్రదాయమని తెలిపారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఇలాంటి ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భూలక్ష్మి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరిసి పాడిపంటలతో సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఇంతటి పవిత్రమైన కార్యక్రమంలో తన వంతు సహకారంగా రూ.2,00,116 అందించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏక్కటి రఘుపాల్ రెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, సునీల్, సాహెబ్ హుస్సేన్, వావిలాల సత్యనారాయణ, జడల శ్రీకాంత్, మేక శ్రీనివాస్, ఐలయ్య యాదవ్, నల్ల కొండల్ రెడ్డి, సంపత్ అడిగొప్పుల, హరీష్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన చైర్మన్ బలరాం రెడ్డి



ధర్మారం,నవంబర్15 (ప్రజా జ్యోతి న్యూస్): ధర్మారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను నంది మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ధర్మారం మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాడెం శ్రీనివాస్ అత్తమ్మ మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అదేవిధంగా ఖిలావనపర్తి గ్రామశాఖ అధ్యక్షుడు సామంతుల రమేష్‌తండ్రి ఐదు రోజుల క్రితం మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులతో కలిసి మృతుడి కుటుంబానికి రూ.9 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఖిలావనపర్తి సర్పంచ్ మోతె కనకయ్య, బీఆర్ఎస్ మండల మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు పాకాల రాజయ్య, కుందేళ్ల మల్లేష్, తొట్ల అనిల్, చొప్పరి కృష్ణ, ఆవుల శ్రీనివాస్, రెడపాక శ్రీనివాస్, ఆఖరి సత్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్రీ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ నూతన భవనం ప్రారంభం

• అన్నదానం మహాదానమన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు





వేములవాడ, నవంబర్, 15: ప్రజాజ్యోతి. వేములవాడపట్టణంలోని శ్రీ అయ్యప్ప అన్నదాన చారిటబుల్ ట్రస్ట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సతీమణి వనజ, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ..శ్రీ అయ్యప్ప అన్నదాన చారిటబుల్ ట్రస్ట్ నూతన భవనం ప్రారంభం ద్వారా అన్నదాన కార్యక్రమాలతో పాటు పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అత్యంత గొప్ప సేవ అని, అన్నదానం మహాదానమని పేర్కొన్నారు. సేవాభావంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్న వ్యవస్థాపకులు, నిర్వాహకులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షుడు, కౌన్సిలర్ తూమ్ మధు, కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్, కొక్కుల బాలకృష్ణ, ట్రస్ట్ వ్యవస్థాపకులు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నాంది చారి ట్రబుల్ ట్రస్ట్ 15 వేల 600 ఆర్థిక సహాయం



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 15 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సింగం సదానందం ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని. నాంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో .సభ్యులు. ఆదివారం రోజున పరామర్శించి సంతాపం విలబుచ్చారు. ఆర్థిక సహాయంగా 15వేల600వందల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాంది చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్ రెడ్డి. ట్రస్టు సభ్యులు.అల్లం శంకర్ .నల్లరాజిరెడ్డి.కందిసంతోష్.రాణవేణ సదయ్య.తంగళ్ళపల్లి సతీష్. గుడ్ల సంపత్. అలుగు వెల్లిసంపత్ రెడ్డి. రావి శ్రీనివాస్ .తదితరులు పాల్గొన్నారు.

పదోవ వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించిన గ్రామ సర్పంచ్ పెగడ తిరుమల కుమార్



ముత్తారం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామం పదోవార్డులో రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామ సర్పంచ్ పెగడ తిరుమల-కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.ట్రాక్టర్‌ను పంపించి పారిశుద్ధ్య సిబ్బందితో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు నిరంతరం చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్





జమ్మికుంట, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) జమ్మికుంట పట్టణంలోని బాలికల పాఠశాల ఆవరణలో అంజలి కిడ్నీ కేర్ సెంటర్, బాలసముద్రం, హనుమకొండ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. డాక్టర్ గీతాంజలి నరేష్ (యూరాలజిస్ట్, యూరో గైనకాలజిస్ట్, కిడ్నీ సర్జన్), డాక్టర్ నరేష్ సముద్రాల (ఫ్యామిలీ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్) ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరం ద్వారా పట్టణ ప్రజలందరూ ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కలుషిత వాతావరణం, ఆహారపు అలవాట్ల కారణంగా అనేకమంది అనారోగ్యసమస్యలకు గురవుతున్నారని,కొన్నిసార్లు ఆరోగ్య సమస్యలు ప్రారంభ దశలోనే గుర్తించలేకపోతున్నామని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుల్లీప్రతాప్, చిన్నాల శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.